పోలీసు స్టేషన్‌లో వాహనాల వేలం

కనగానపల్లి: స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం నిర్వహించిన వాహనాల వేలం పాటలో రూ. 93 వేల ఆదాయం వచ్చినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఈ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల కింద సీజ్ చేసిన 10 వాహనాలకు వేలం నిర్వహించగా, అందులో 5 వాహనాలు మాత్రమే వేలంలో అమ్ముడైనట్లు ఆయన తెలిపారు.



ధర్మవరం జట్టు విజయకేతనం


క్రీడాకారులను అభినందిస్తున్న క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజి

ధర్మవరం: అండర్–15 క్రికెట్ టోర్నీలో ధర్మవరం జట్టు విజయం సాధించింది. అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో ఏపీఎల్ 2022–23 అండర్–15 క్రికెట్ టోర్నీ ఫైనల్ పోటీలు శనివారం జరిగాయి. ధర్మవరం జట్టు, అనంతపురం జట్టు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 50 ఓవర్లు ముగిసే సరికి 164 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు 132 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో 32 పరుగుల తేడాతో ధర్మవరం జట్టు ఘన విజయం సాధించి విజయం సాధించింది. విజయం సాధించిన జట్టును ధర్మవరం క్రీడా మైదానంలో ధర్మవరం మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజి, కోచ్ రాజశేఖర్‌లు అభినందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కనగానపల్లి: చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కింద ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ కవితాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 3 అంగన్‌వాడీ వర్కర్లు, 4 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్ పోస్టులలో చెన్నేకొత్తపల్లి మండలంలోని గొళ్లవాండ్లపల్లి, రామగిరి మండలంలోని గరిమేకలపల్లి, మాదాపురం గ్రామాల్లో ఖాళీగా ఉన్నాయి. రామగిరి మండలం రెడ్డివారిపల్లి, గంగంపల్లి, తిమ్మాపురం, చెన్నేకొత్తపల్లి మండలంలోని పైలబోయలపల్లిలో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులు ఈనెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కొత్త సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

బత్తలపల్లి: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎవరైనా హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని బత్తలపల్లి ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష హెచ్చరించారు. శనివారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బత్తలపల్లి పరిధిలో పోలీసులు రాత్రి గస్తీపై గట్టి నిఘా ఉంచుతారన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మద్యం షాపులు, హోటళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు, నిర్ణీత సమయాల్లోనే మూసివేయాలన్నారు. రహదారులపై కేక్ కటింగ్‌లు నిషేధమన్నారు. డ్రంకన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపినా, వాహనాలకు సైలెన్సర్లు తొలగించినా చర్యలుంటాయన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో గుత్తి విద్యార్థుల ప్రతిభ

గుత్తి: ఆళ్లగడ్డలో గత నెల 27 నుంచి 30వ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో గుత్తి బాల గంగాధర్ తిలక్ అకాడమీకి చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. కరిష్మా, పూజిత, ఐషా, అంజుమ్, సానియా, హసేన్ ఖాన్ అత్యంత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను తైక్వాండో మాస్టర్ సాయితేజ అభినందించారు.









ఘనంగా పల్లకీసేవ

ఉరవకొండ రూరల్: మండలంలోని ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె. విజయ్‌కుమార్, అర్చకుల ఆధ్వర్యంలో శనివారం పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి, మేళతాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు.


వాహనం సీజ్

యల్లనూరు: ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యూవల్ చేసుకోని టాటా ఏస్ వాహనాన్ని శనివారం ఎంవీఐ శ్రీనివాసులు సీజ్ చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

తప్పిన ప్రమాదం

పామిడి: పట్టణంలోని గుత్తి బీసీసీ రోడ్డులో సాయి హాస్పిటల్ సమీపాన శనివారం ఐచర్ వాహనం చెట్టును ఢీకొట్టింది. ఘటనలో చెట్టు వేర్లతోపాటు ఊడిరాగా కరెంటు తీగలు చెట్టు కిందపడకుండా అడ్డుకున్నాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఏఈ మధుసూదన్ ఆధ్వర్యంలో సిబ్బంది వైర్లను సరిచేశారు.































నాణ్యమైన విద్యాబోధన కోసమే ట్యాబ్‌లు

● ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: పేద విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో సంస్కరణలు తీసుకొచ్చారని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కాళసముద్రం గురుకుల పాఠశాలలో శనివారం ఆయన 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. పాఠ్యాంశాలు సులభంగా అర్థం అయ్యేలా రూ.688 కోట్లతో బైజూస్ లోడెడ్ శాంసంగ్ ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. అర్థం కాని పాఠ్యాంశాలను రివిజన్ చేసుకుని చదువుకోవచ్చని పేర్కొన్నారు. నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే ఆంగ్లంపై పట్టు ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రకాష్, సర్పంచ్ లలితమ్మ, ఎంపీటీసీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

నరసింహులు, మాజీ సర్పంచ్ జయరామిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ దాదాపీర్, ముబారక్,బాబ్జాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

బత్తలపల్లి: సంజీవపురం కేజీబీవీలో 39 మంది, దంపెట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదుగురు 8వ తరగతి విద్యార్థులకు శనివారం ఎంపీపీ గుర్రం వనజ, సంజీవపురం, దంపెట్ల సర్పంచులు కమతం వరలక్ష్మి, చల్లా కరుణాకర్‌నాయుడు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రతి విద్యార్థీ కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకొని సీఎం వైఎస్ జగనన్న ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. ప్రిన్సిపాల్ నాగరత్నభాయి, ఉపాధ్యాయులు నవనీత, పార్వతి, ధరణి, సౌజన్య, హేమలత, సాయికల్పన, కవిత, లక్ష్మీ, కళ్యాణి, ఉమా, వైఎస్సార్‌సీపీ నాయకులు కమతం ఈశ్వరయ్య, బండి వీరనారప్ప, దంపెట్లలో విశ్వనాథగుప్తా, మహేష్, శ్రీలక్ష్మీ, కార్యదర్శి భారతి పాల్గొన్నారు.

తలుపుల: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 8 వతరగతి విద్యార్థులకు శనివారం ఎంఈఓ వెంకట్రాముడు, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఉబ్బరవాండ్లపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో ఎంపీపీ రఫీనాయక్, మాజీ సర్పంచ్ సూర్యనారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ డిక్‌బాబు, టోపీరమణ, సథారెడ్డి, మహమ్మద్ పీర్, నజీర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లచెరువు: దేవిరెడ్డిపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో 94 మంది 8వతరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ప్రిన్సిపల్ రాణాప్రతాప్‌నాయక్ పంపిణీ చేశారు.

అమడగూరు: మస్తాన్‌రెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జేకేపల్లి ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. నాణ్యమైన విద్యను అందివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిందన్నారు. పార్టీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి (జెడ్పీటీసీ భర్త), సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ గుర్రం వనజ, సర్పంచు వరలక్ష్మీ



తలుపుల: ఉబ్బరవాండ్లపల్లిలో ట్యాబ్‌లతో విద్యార్థులు



అమడగూరు: ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నేడు పింఛన్ల పంపిణీ

తలుపుల: వైఎస్సార్ పింఛన్ కానుక కింద ఆదివారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రామానాయక్, ఈఓ మాధవరెడ్డి తెలిపారు. మొత్తం 6914 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.1,91,49,500 విడుదలైనట్లు తెలిపారు. ఈమొత్తాన్ని ఆయా గ్రామ కార్యదర్శుల వద్ద నుంచి వలంటీర్లకు అందజేశామని వారు తెలిపారు. పింఛన్‌ను రూ.2,500 నుంచి రూ.2,750కి పెంచినట్లు తెలిపారు.

బత్తలపల్లి: పింఛన్ల సొమ్మును ఆదివారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్ తెలిపారు. మండల వ్యాప్తంగా 6,285 మందికి సంబంధించి రూ.1,74,36,250 విడుదలైనట్లు తెలిపారు. బయోమెట్రిక్ పడని వారి ఫొటో తీసుకుని మరుసటి రోజు వలంటీర్లు లబ్ధిదారుని ఇంటి వద్దకు వచ్చి పింఛన్ మొత్తం అందజేయనున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ

ఓడీ చెరువు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2020–22 ఏడాదిలో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్‌ను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ ఫర్హీన్‌బాను, ఎంపీడీఓ పోలప్ప సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం అన్నిశాఖల అధికారులు, సామాజిక తనిఖీ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల నాణ్యత, నిధుల సద్వినియోగంపై క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అదేవిధంగా సచివాలయ పనులు తనిఖీ చేయనున్నట్లు చెప్పారు. ఎస్ఆర్పీ లక్ష్మినారాయణ, అగ్రి అడ్వైజరీబోర్డు చైర్మన్ లక్ష్మిరెడ్డి, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, ఏపీఓ సోముశేఖర్, డీఆర్పీలు అమరేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్,సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

● కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



పుట్టపర్తి టౌన్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2023 సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు తీసుకురావాలని ఆంక్షించారు. సైనికులు, పోలీసులు నిరంతరం శ్రమించడంవల్లనే మనమంతా సుఖశాంతులతో జీవిస్తున్నామన్నారు. వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సర వేడుకల్లో ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని సూచించారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

అమడగూరు: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని తుమ్మల కొండలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు చింతా శరత్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. సోమవారం కొండలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని పునీతులు కావాలని పేర్కొన్నారు. అలాగే హరిపురంలోని కోదండరామస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు గ్రామస్తులు బొట్టుస్వామి, గ్రామపెద్దలు పేర్కొన్నారు.

స్ప్రింక్లర్ల చోరీ

ఎన్పీకుంట: పొలంలో ఉన్న స్ప్రింక్లర్లు చోరీకి గురైనట్లు మండల పరిధిలోని గోవిందురాజుల పల్లి గ్రామానికి చెందిన రైతు పాపిరెడ్డి తెలిపాడు. రెండు సంవత్సరాలుగా స్ప్రింక్లర్లతో వేరుశనగ పంట సాగు చేస్తున్నట్లు తెలిపాడు. శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా పైప్‌లైన్‌కు అమర్చిన స్ప్రింక్లర్లు కనిపించ లేదన్నాడు. చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపాడు.

ఘనంగా ఇరుముడి

అమడగూరు: మండలంలోని కొత్తపల్లిలో అయ్యప్పమాల ధరించిన 35 మంది భక్తులకు శనివారం ఇరుముడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం మాలధారులు గురుస్వాముల ఆదేశాలతో ఇరుముడిని నెత్తిన పెట్టుకుని శబరిమలైకు బయలుదేరి వెళ్లారు. ఆదివారం పేరంవాండ్లపల్లిలో 56 మంది అయ్యప్పలకు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ గ్రామ అయ్యప్పలు పేర్కొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ ఉచితంగా పొందొచ్చు

కదిరి టౌన్: కదిరి సబ్ ట్రెజరీ పరిధిలో పెన్షన్ తీసుకుంటున్న సర్వీస్ పెన్షనర్లు జనవరి 1 నుంచి ట్రెజరీలో అందజేయాల్సిన లైఫ్ సర్టిఫికెట్‌ను పెన్షనర్ల భవనంలో ఉచితంగా ఆన్‌లైన్ చేసి ఇవ్వనున్నట్లు పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి ఆత్మారెడ్డి తెలిపారు. పెన్షనర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

వాహనాల వేలంతో రూ.2.43 లక్షల ఆదాయం

తలుపుల: వివిధ కేసుల్లో పట్టుబడిన 11 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారును శనివారం ఎస్ఐ మగ్బుల్‌బాషా, సెర్ప్ సీఐ రామమోహన్ ఆధ్వర్యంలో వేలం వేశారు. 12 వాహనాలను రూ.2,43,965కు పాటదారులు దక్కించుకున్నారు. కారును ఎవరూ వేలం పాట పాడకపోవడంతో నిలిచిపోయింది.

వేమన జయంతిపై హర్షం



మాట్లాడుతున్న కామాటం శేషాద్రిరెడ్డి

ధర్మవరం: ప్రజాకవి యోగివేమన జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించేలా జీఓ విడుదల చేయడం శుభపరిణామమని రెడ్డి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



ఎంపీఈఓ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: మండల ప్రజలు ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. శనివారం ఎంపీడీఓ కొండన్న, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా ముందస్తుగా కేక్ కట్ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధిచేకూర్చిందన్నారు.

కేతిరెడ్డి అభిమాని పాదయాత్ర

తాడిమర్రి: ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన గుడ్‌మార్నింగ్ ధర్మవరం కార్యక్రమాలకు ఆకర్షితుడైన విజయనగరం జిల్లాకు చెందిన అభిమాని శేఖర్ నాయుడు ధర్మవరానికి పాదయాత్ర చేపట్టాడు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనే ప్లకార్డుతో 20 రోజుల క్రితం పాదయాత్ర మొదలు పెట్టాడు. శనివారం ఆయన పెద్దకోట్ల, తాడిమర్రికి చేరుకోగా ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేఖర్‌నాయుడు మాట్లాడుతూ కేతిరెడ్డి చేపట్టిన గుడ్‌మార్నింగ్ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేసేందుకు ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. మాజీ సర్పంచు పాటిల్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచు వెంకటవరద పాల్గొన్నారు.



పెద్దకోట్లలో శేఖర్ నాయుడుకు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

బత్తలపల్లి: మండల కేంద్రానికి చేరుకున్న శేఖర్ నాయుడుకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి పూలమాలలతో స్వాగతం పలికారు. సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు నరేంద్రరెడ్డి, సర్పంచు అక్కిం దామోదర్, ఉప సర్పంచు బండి నాగభూషణ పాల్గొన్నారు.

మిన్నంటిన కొత్త సంవత్సర సంబరాలు

బత్తలపల్లి: 2022 సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ 2023 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పట్టణంలో నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా శనివారం రాత్రి వీధుల్లోకి వచ్చి సందడి చేశారు. విందులు, వినోదాలతో మునిగిపోయిన యువకులు 12 గంటలు సమయం కాగానే బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ కేరింతలు కొట్టారు. ద్విచక్రవాహనాలను రోడ్లపై తిప్పుతూ సంతోషంగా కొత్త సంవత్సరంకు స్వాగతం పలికారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు రంగవల్లులను అందంగా తీర్చిదిద్ది కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. బత్తలపల్లి కూడలిలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ సభ్యుడు కోటి నరేష్ కుమార్, ఉప సర్పంచు కోటి గోపీనాథ్ యువకులతో కలిసి కేక్ కట్ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ టీవీ శ్రీహర్ష బందోబస్తు పర్యవేక్షించారు.



కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బత్తలపల్లిలో ఓ ఇంటి వద్ద తీర్చిదిద్దిన రంగవల్లిక

కదిరి టౌన్: కదిరి పట్టణంలో కదిరి వేమారెడ్డి సర్కిల్, జీవిమాను సర్కిల్, టవర్‌క్లాక్ వద్ద యువకులు శనివారం రాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. 2023 నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. యువకులు బాణసంచా పేల్చి బైక్‌లపై సంచరిస్తూ కేరింతలు కొట్టారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ నినాదాలు చేశారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: డాక్టర్ వైఎస్సార్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకం కింద మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కందిలో పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. ఈదుల ముష్టూరులో సర్వే నంబర్ 1–1లో పద్మావతి పొలంలో, దంపెట్ల గ్రామంలో 248–2 సర్వే నెంబర్ అరుణ, 250–2ఎ సర్వే నెంబర్‌లో పురుషోత్తంనాయుడు పొలంలో, డి.చెర్లోపల్లి గ్రామంలోని 172–1డి రామానాయుడు పొలంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. కందికాయలను ఎండబెట్టిన తర్వాత నూర్పిడి చేసి దిగుబడిని అంచనా వేస్తామని అధికారులు తెలిపారు. ఏఓ ఓబిరెడ్డి, వీహెచ్ఏ సత్యనారాయణ, ఎంపీఈఓ సోమశేఖర్, వీఏఏ నాగార్జున, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ, దంపెట్ల సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ అధికారులు రఫీ, వలంటీర్లు రవి, హేమావతి, వీఆర్‌ఏలు రామాంజనేయులు, కదిరప్ప పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగాలను నిర్వహిస్తున్న అధికారులు

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి



రాప్తాడులో జగనన్న కాలనీలో తలుపులు అమర్చే నిలువులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న అధికారులు

రాప్తాడు: లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వైఎస్సార్ జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు తలుపుల నిలువులు పంపిణీ చేశారు. రాప్తాడు జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకునే వారందరికీ నిలువులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాసరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచును పరామర్శించిన ఎమ్మెల్యే



సర్పంచు గోవిందరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం గోనికవారిపల్లి సర్పంచు గోవిందరెడ్డి రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి గోవిందరెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేడు రాప్తాడులో ఎమ్మెల్యే పర్యటన

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటన ఉంటుందని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం పింఛన్ల పంపిణీకి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. గ్రామ వలంటీర్లు, పార్టీ సచివాలయాల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

పరిశుభ్రత పాటించాలి



మరూరులో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఎస్‌వీబీటీ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ పేర్కొన్నారు. శనివారం మరూరులో ఎస్‌వీబీటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, సర్పంచు ప్రభావతి వీధుల్లో శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయక్, పీడీ రమేష్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్తంభంపై నుంచి పడి ఏఎల్ఎంకు తీవ్ర గాయాలు



వాహనంలో ప్రథమ చికిత్స నిర్వహిస్తున్న సిబ్బంది

ఎన్పీకుంట: పడమరనడింపల్లి గ్రామంలో శనివారం విద్యుత్ స్తంభంపై ఫీజులు వేస్తుండగా ఏఎల్ఎం రాము విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. తలకు, చేతికి బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆధిపత్య పోరుతో అమాయకుల బలి

● బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంపావతి గోవిందు

కదిరి అర్బన్: కందుకూరు తెలుగుదేశం పార్టీ కమ్మ నేతల అధిపత్య పోరు 8 మంది అమాయకుల ప్రాణాలను బలిగొందని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంపావతి గోవిందు ఆరోపించారు. శనివారం ఆయన ఆపార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడు బలహీనవర్గాలకు ఏమీ చేయలేకపోయినా వారి మరణాలను తనకు, తన పార్టీకి మైలేజ్ వచ్చేలా చేసుకోవడంలో దిట్ట అన్నారు. చనిపోయిన ఎనిమిది మందిలో ఆరుగురు బలహీనవర్గాల వారు ఉండగా అందులో ఒకరు ఎస్టీ యానాది, మాదిగ ఇద్దరు, మాల ఇద్దరు, ఒకరు ఆచారి అని చెప్పారన్నారు. మిగిలిన ఇద్దరు ఓసీలని పేర్కొన్న టీడీపీ నాయకులు.. వారు కమ్మకులానికి చెందినవారని చెప్పకుండా దాచడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. సమావేశంలో ప్రసాద్, సురేంద్రనాథ్, బెనర్జీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంపావతి గోవిందు

ముక్కోటి ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన

కదిరి టౌన్: శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జనవరి 2న నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశికి సంబంధించిన ఏర్పాట్లను కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శనివారం పరిశీలించారు. వైకుంఠ ద్వార దర్శనానికి కదిరితోపాటు వివిధ ప్రాంతాలనుంచి వేలాదిమంది భక్తులు హాజరవుతున్నందున వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆలయ చైర్మన్ గోపాలక్రిష్ణ, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, పాలక మండలి సభ్యులు రవీంద్రరెడ్డి, అశ్వర్థనారాయణ, గంగాధర్, గోపాల్‌రెడ్డి, మల్లి, శివప్రసాద్, పట్టణ సీఐ తిమ్మనేని మధు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

కదిరి నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. దేవుని ఆశీస్సులతో సీఎం వైఎస్ జగన్ నూతన సంవత్సరంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

పేదలకు ఇంటి పట్టాల అందజేత

కదిరి అర్బన్: మండల పరిధిలోని సున్నపుగుట్ట తాండాకు చెందిన 40 మంది పేదలకు ఎమ్మెల్యే డా. పీవీ సిద్దారెడ్డి శనివారం తన నివాసంలో ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బైపాస్ రోడ్డుకు అనుకుని ఉన్న భూమిలో ఒకొక్కరికి రూ.15 లక్షల విలువైన స్థలాన్ని ఇస్తున్నామన్నారు. వారం రోజుల్లో ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, సీనియర్ నాయకులు ఆదినారాయణ, ఎంపీటీసీ పుల్లయ్య, కో–ఆప్షన్ సభ్యుడు అల్లాబకాష్, వెంకటేశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి


యువతి మృతి

గార్లదిన్నె: ఆత్మహత్యకు యత్నించిన ఓ యువతి శనివారం మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... మర్తాడుకు చెందినఆంజనేయులు కుమార్తె ఉమాదేవి(25) డిసెంబర్ 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషద్రావకం తాగింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

పెద్దపప్పూరు: అమ్మలదిన్నె గ్రామంలో శనివారం ఓ మహిళ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు.. గ్రామానికి చెందిన ఆదినారాయణమ్మ కుటుంబ కలహాల కారణంగా ఉదయం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి వివరాల మేరకు పెద్దపప్పూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

అయ్యప్ప మాలధారుల నిరసన



ర్యాలీలో పాల్గొన్న అయ్యప్పస్వామి మాలధారులు

ధర్మవరం అర్బన్: అయ్యప్పస్వామి పట్ల అనుచితంగా వ్యాఖ్యలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన తెలంగాణకు చెందిన బైరి నరేష్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అయ్యప్ప మాలధారులు డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం వన్ టౌన్ సీఐ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. హిందూధార్మిక, సామాజిక, ఆధ్యాత్మిక సేవ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేమన సాహిత్యానికి ప్రత్యేక గుర్తింపు

● విశ్రాంత వీసీ కాడా రామకృష్ణారెడ్డి

అనంతపురం కల్చరల్: వేమన సాహిత్యానికి, కటారుపల్లెలోని యోగి వేమన సమాధికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చేలా చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డికి విశ్రాంత వీసీ కాడా రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వేమన ఫౌండేషన్ కార్యాలయంలో వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేసిన ప్రభుత్వాన్ని అభినందిస్తూ పలువురు రచయితలు, పరిశోధకులతో సమావేశం జరిగింది. డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రామకృష్ణారెడ్డితో పాటు విశ్రాంత రిజిస్ట్రార్ రవీంద్రరాజు, మానవత సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, రచయితలు రియాజుద్దీన్, మధురశ్రీ, రామలింగారెడ్డి, ఎల్కేపీ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య తదితరులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నీరాజనాలర్పించారు.